సాక్షి వికారాబాద్

మంగళవారం । 30 । ఏప్రిల్ । 2024



ఓటమి నుంచి పాఠం నేర్చుకో

చదువు కోసం చాలా ఖర్చు చేస్తున్నాం.. ర్యాంక్ రాకుంటే డబ్బు వృథా అని తల్లిదండ్రులు పిల్లలతో అంటున్నారు. 8లో▸



రోడ్డుపై ధాన్యం..

పంట నూర్పిడి సమయంలో రహదారులన్నీ కల్లాలుగా మారుతున్నాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. 8లో▸



కాంగ్రెస్‌తోనే దేశానికి మేలు

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే దేశానికి ఎంతో మేలు జరుగుతుందని ఆ పార్టీ శ్రేణులు అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాండురంగం



నియామక పత్రం అందుకుంటున్న పాండురంగం

కొడంగల్ రూరల్: కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెద్దనందిగామ గ్రామానికి చెందిన పాండురంగంను ఎంపిక చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కే సంజీవరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా పాండురంగం మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

ఎన్నికల కో ఇన్‌చార్జ్‌గా రామ్మోహన్‌రెడ్డి



పరిగి: చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల ఏఐసీసీ కో ఇన్‌చార్జ్‌గా డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టీరామ్మోహన్‌రెడ్డిని పీసీసీ నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేస్తూ నిత్యం ప్రజల్లో ఉంటామన్నారు. చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

నేటితో వాహన పన్నులు చెల్లింపునకు ఆఖరు

జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరెడ్డి

అనంతగిరి: అద్దె, వ్యాపార అవసరాల కోసం వినియోగించే వాహనాలకు సంబంధించిన పన్ను బకాయిలను ఈ నెల 30 తేదీలోగా చెల్లించాలని జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్రైమాసిక పన్ను బకాయిలను మీ సేవ కేంద్రాలు, లేదా ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని తెలిపారు. గడువు పూర్తయిన తర్వాత 200శాతం అపరాధ రుసుం విధించనున్నట్లు తెలిపారు. మే ఒకటి నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 5వేల వాహనాలకు సంబంధించి రూ.2 కోట్ల వరకు పన్నులు వసూలు కావాల్సి ఉందని వివరించారు. ఏదైనా సమాచారం కోసం సెల్ నంబర్ 98485 28441లో సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

జిల్లా యువజన క్రీడల అధికారి హనుమంతరావు

అనంతగిరి: మే ఒకటవ తేదీ నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి కే హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 10, పట్టణ ప్రాంతాల్లో 5 శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణ ఇచ్చే వారికి గౌరవ వేతనంతో పాటు క్రీడా సామగ్రి, క్యాంప్ ముగిసిన తరువాత సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో సీనియర్ ప్లేయర్లు లేదా కోచ్ సహకారంతో పే అండ్ ప్లే పద్ధతిలో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. అండర్ - 14 విభాగంలో బాలబాలికలు క్రీడల్లో శిక్షణ ఇస్తామని, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఇతర సమాచారం కోసం సెల్ నంబర్ 9676638201లో సంప్రదించాలని సూచించారు.

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోండి

అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెక్టోరల్ అధికారులు, హోమ్ ఓటింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌పై శిక్షణ ఇచ్చారు. ఓటింగ్ విషయంలో గోప్యత పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఓ జయసుధ, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనర్స్ రామ్‌రెడ్డి, వీరకాంతం తదితరులు పాల్గొన్నారు.

సమరమే..



ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ

- విత్‌డ్రా చేసుకుంది ముగ్గురు మాత్రమే..
- బరిలో 43 మంది అభ్యర్థులు
- నేటి నుంచి ప్రచారం ముమ్మరం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. సోమవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు ముగ్గురు అభ్యర్థులు మాత్రమే తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం చేవెళ్ల లోక్‌సభ స్థానానికి బరిలో 43 మంది ఉన్నారు. నామినేషన్లు ఉపసంహరించుకున్న వారిలో బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థులు మహ్మద్ చాంద్‌పాషా, దూదేకుల ఇమామ్ హుస్సేన్ ఉన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల్లో 22 మంది గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు చెందిన వారు కాగా, మరో 21 మంది స్వతంత్రులు ఉన్నారు. ఈ నెల 18 నుంచి 25 వరకు చేపట్టిన నామినేషన్ల స్వీకరణలో భాగంగా మొత్తం 64 మంది 88 నామినేషన్లు దాఖలు చేశారు. అసంపూర్తిగా ఉన్న నామినేషన్లతో పాటు అఫిడవిట్లు సమర్పించని 18 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 46 మంది పోటీకి అర్హత పొందారు. ముగ్గురు తమ నామినేషన్లు ఉపసంహరించుకోగా, మిగిలిన వారంతా పోటీలో ఉన్నారు.

బరిలో నిలిచింది వీరే..

కాసాని జ్ఞానేశ్వర్ (బీఆర్‌ఎస్), కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (బీజేపీ), గడ్డం రంజిత్‌రెడ్డి (కాంగ్రెస్), కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్), పి.గోవింద్ (బహుజన్ ముక్తి పార్టీ), చింతలగారి వెంకటస్వామి (బ్లూ ఇండియా పార్టీ), తొట్ల రాఘవేందర్ ముదిరాజ్(ధర్మ సమాజ్ పార్టీ), దుర్గాప్రసాద్ (ప్రజా వెలుగు పార్టీ), నరసింహారెడ్డి దేప (తెలంగాణ రిపబ్లికన్ పార్టీ), పాలమాకుల మధు(ఇండియా ప్రజాబంధు పార్టీ), ఫణి ప్రసాద్ కటకం (సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా), మహ్మద్ అబ్దుల్ ఖావి అబ్బాసి (ఆల్ ఇండియా మజ్లిస్-ఇ- ఇంకిలాబ్-ఇ-మిల్లత్), మహ్మద్ సలీం (రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్-సెక్యులర్), మహ్మద్ షకీల్ (దేశ్ జనహిత్ పార్టీ), బీవీ రమేష్ నాయుడు (సోషలిస్ట్ పార్టీ-ఇండియా), రాములు బింగి(యుగ తులసి పార్టీ), రంజిత్‌రెడ్డి గాదే (రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ), శ్రీదేవి ఎం (అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ), సానెం రాజుగౌడ్ (ప్రజా ఏక్తా పార్టీ), సుగురు శ్రీనివాస్ (జై స్వరాజ్ పార్టీ), సుధాకర్ వనం (మార్క్సిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా-యునైటెడ్), సేరుబాయి వసంతకుమార్ (రాష్ట్ర సామాన్య ప్రజాపార్టీ) అభ్యర్థులు పోటీలో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా అమీర్‌సాజిత్, అంకగాల ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులు నీరటి, ఈసరి సూర్యప్రకాష్‌రెడ్డి, కత్తుల యాదయ్య, కావలి సుకుమార్, కండికేకర్ శ్రీనివాస్, గోనె శ్రీనివాసరెడ్డి, గోవింద్‌లాల్, జనపాల దుర్గాప్రసాద్, జలీల్ అహ్మద్, వి.పాండు, జి.మల్లేష్‌గౌడ్, మహ్మద్ ఇక్బాల్, మహ్మద్ అఫ్సర్ ఖుర్దూస్, మహ్మద్ అలీ, మహ్మద్ పాషా, మమ్మద్ ముస్తఫా రిజ్వాన్, మహ్మద్ రియజుర్ రెహమాన్ షేక్, విశ్వకర్మ సప్తగిరి, సాహితి దాసరి బరిలో నిలిచారు. పోటీలో ఉన్న అభ్యర్థుల్లో 11 మంది ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వారే ఉండటం గమనార్హం.



అనంతగిరి: సమావేశంలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

యువత చూపు మోదీ వైపు

- బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అనంతగిరి: బీజేపీకి యువత కొండంత అండగా నిలుస్తోందని ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం వికారాబాద్‌లోని కొండా బాలకృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌రెడ్డి అధ్యక్షతన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీకి ప్రతి బూత్ బలంగా ఉందని, మెజార్టీ సాధించాలని పిలుపునిచ్చారు. ధర్మం కోసం, దేశం కోసం ప్రధాని మోదీకి అండగా నిలవాలన్నారు. చేవెళ్ల ఎంపీగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇండియా కూటమి పీఎం అభ్యర్థి ఎవరో తెలియదని ఎద్దేవా చేశారు. రోజురోజుకూ కూటమి క్షీణిస్తోందని ఆరోపించారు. అనంతరం బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతికి యువ నాయకులు ముందుకు నడవాలన్నారు. పార్టీకి యువతే వెన్నెముక అన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజు, రాష్ట్ర నాయకులు కేపీ రాజు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నందు, బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్, ఉపాధ్యక్షులు తరుణ్‌రెడ్డి, మహేష్, రాష్ట్ర అదనపు కార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటమి భయం

పూడూరు: వందేళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి ఓటమి భయం పట్టుకుందని బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం పూడూరులో ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీకి, ప్రధాని మోదీకి వస్తున్న ఆదరణ చూసి కాంగ్రెస్ నాయకులకు నిద్ర పట్టడం లేదన్నారు. యూపీలో బీజేపీ ప్రభంజనం ముందు నిలువలేక కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అమేథీ నుంచి పారిపోయారని ఎద్దేవా చేశారు. ఈ సారి ఎన్నికల్లో హిందువులంతా ఏకమై బీజేపీకి పట్టం కట్టడం ఖాయమన్నారు. చేవెళ్లలో ఎంపీ రంజిత్‌రెడ్డి ముస్లిం ఓట్లను అడ్డం పెట్టుకుని గెలవాలని చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రజలను విస్మరించాయని, ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా చేవెళ్లలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్‌పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, మాజీ మండల అధ్యక్షుడు అనిల్ పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డి పోటీనే కాదు

పరిగి: కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి తనకు ఏ మాత్రం పోటీ కాదని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన ఓబీసీ మోర్చా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను 3లక్షల మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. గతంలో రంజిత్‌రెడ్డి ఎంపీ పదవిని అడ్డుపెట్టుకొని కోడి గుడ్ల స్కాం, దాణా స్కాం చేశారని ఆరోపించారు. తెలంగాణలో అధిక సీట్లు గెలుస్తామన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆశ్వరప్ప, మారుతికిరణ్ పాల్గొన్నారు.



రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

దేవుని పేరుతో రాజకీయం

- బీజేపీకి 200ల ఎంపీ సీట్లు కూడా రావు
- రంజిత్‌రెడ్డిని గెలిపించి సీఎంకు కానుకగా ఇద్దాం
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- ధారూరులో కార్నర్ మీటింగ్

ధారూరు: దేవుని పేరు చెప్పి ఓట్లు అడిగితే ప్రజలు వేస్తారని ప్రధాని మోదీ భ్రమలో ఉన్నారని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. సోమవారం రాత్రి ధారూరులో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డితో కలిసి కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీకి ఈ సారి 200 సీట్లు కూడా రావన్నారు. రిజర్వేషన్లు కొనసాగాలంటే కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని సూచించారు. పార్టీ చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డికి ఈ నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీ ఇచ్చి సీఎం రేవంత్‌రెడ్డికి కానుక ఇద్దామని పిలుపునిచ్చారు. ఎన్నికల తర్వాత ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అర్హులందరికీ అందేలా చూస్తుందని హామీ ఇచ్చారు. వికారాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి దాదాపు రూ.500 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. త్వరలో పనులను ప్రారంభిస్తామని చెప్పారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మూడోసారి కూడా సీఎం అవుతానని భావించారని, ప్రజలు దిమ్మదిరిగేలా బుద్ధి చెప్పి ఫాంహౌస్‌లో కూర్చోబెట్టారని అన్నారు. బీజేపీ పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. కేవలం కుల, మత రాజకీయాలు చేశారని మండిపడ్డారు. ఏం చేశారో చెప్పి ప్రజలను ఓట్లు అడగాలని ఆయన డిమాండ్ చేశారు. ఆరు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ఇండియా కూటమికి అనుకూలంగా ఓట్లు పడ్డాయని అన్నారు. ఈ సారి రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. రంజిత్‌రెడ్డి కేంద్ర మంత్రి అవుతారని, జిల్లాకు పెద్ద ఎత్తున నిధులు తెస్తారని పేర్కొన్నారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు హన్మంత్‌రెడ్డి, రాములు, బాబాఖాన్, బుజ్జయ్యగౌడ్, మల్లారెడ్డి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

మర్పల్లి: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్ కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదింటిని ఇప్పటికే అమలు చేసిందని తెలిపారు. ఎంపీ ఎన్నికలు పూర్తి కాగానే రైతు రుణమాఫీ అమలు చేయడం ఖాయమన్నారు. అనంతరం గడ్డం రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మర్పల్లి మండలం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఉత్సాహం చూస్తుంటే తమ విజయం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు సుకేష్, రఫీ, రాచన్న, సుభాస్ యాదవ్, రాములు యాదవ్, రామేశ్వర్, రవీందర్, లక్ష్మారెడ్డి, ఖలీమొద్దీన్, సురేష్, రాజు, రవివర్మ, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీ-విజిల్‌ను సద్వినియోగం చేసుకోండి

రంగారెడి జిల్లా ఎన్నికల అధికారి శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చేవెళ్ల లోక్‌సభ ఎన్నికలు పారదర్శకంగా జరగడానికి ప్రజలు సి-విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు ఈ యాప్ ద్వారా 108 ఫిర్యాదులు వచ్చాయని, వాటన్నింటినీ పరిష్కరించినట్టు చెప్పారు. జిల్లాలో ఓటర్లను ప్రలోభపెట్టినా, భయభ్రాంతులకు గురి చేసినా, బలవంతంగా ప్రభావితం చేసినా సి-విజిల్ యాప్ ద్వారా ఎవరైనా సరే సమాచారం ఇవ్వొచ్చని సూచించారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆండ్రాయిడ్ మొబైల్ ఉన్న ఎవరైనా యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, సమస్యను ఎప్పటికప్పుడు కెమెరా ఆన్ చేసి ఫొటో లేదా వీడియో తీసి సంక్షిప్తంగా టైప్ చేసి పంపించాల్సి ఉంటుందని తెలిపారు. సి-విజిల్ ద్వారా చేసే ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచనున్నట్టు పేర్కొన్నారు. ఎన్నికలు సజావుగా పారదర్శకంగా జరగాలంటే ప్రజలు తమ కళ్లముందు కనిపిస్తున్న అన్యాయాన్ని వెంటనే సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. సివిజిల్ యాప్ సురక్షితమైందని, దీనిని ఆపరేటింగ్ చేయడం చాలా సులువన్నారు. ఇంగ్లిష్‌లో కానీ తెలుగులో కానీ సమస్యను పంపించొచ్చని సూచించారు.

ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ 1950

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు టోల్ ఫ్రీ నంబర్ 1950 ద్వారా ఫిర్యాదు చేయొచ్చని కలెక్టర్ శశాంక సూచించారు. ఈ కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారని, రిజిస్టర్ ఏర్పాటు చేసి వచ్చిన ఫిర్యాదులను నమోదు చేయడం జరుగుతుందన్నారు.

వంద శాతమే లక్ష్యంగా..

లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌పై ప్రత్యేక దృష్టి

- విస్తృత ప్రచారం చేస్తున్న అధికారులు
- నేటికీ కొందరు ఓటింగ్‌కు దూరం

పరిగి: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం. ఈ అవకాశాన్ని చాలామంది వినియోగించుకోవడం లేదు. భారత రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును కొందరు విస్మరించడంపై ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించింది. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓట్ల పండుగలో పాల్గొనేలా చర్యలు చేపట్టింది. ఎన్నికలు జరిగిన ప్రతిసారీ ప్రతి ఒక్కరూ ఓటువేయాలని సూచిస్తోంది. విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ప్రధానంగా స్వీప్ (సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అధికారులతో స్వీప్ కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా విద్యాసంస్థల్లో ప్రచారం చేయిస్తున్నారు. అవగాహన ర్యాలీలు, 5కే రన్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొత్త ఓటర్లు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్లు, కార్మికులు, వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించారు.



ఓటుహక్కు వినియోగంపై 5కే రన్ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

ఓటు వేస్తేనే భవిష్యత్

అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు వేస్తేనే దేశ భవిష్యత్ మారుతుందని అధికారులు, మేధావులు సూచిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో అమూల్యమైన ఓటుకు ఏ ఒక్కరూ దూరంగా ఉండొద్దని అవగాహన కల్పిస్తున్నారు. ఓటింగ్ శాతం పెంచడంలో భాగంగా పోలింగ్ కేంద్రాల వారీగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులు ఇళ్ల వద్దే ఓటు వేసే సౌకర్యం కల్పిస్తున్నారు. ఓటు వేయడం ద్వారా మంచి నాయకున్ని ఎన్నుకోవచ్చని, తద్వారా తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. చదువుకున్న వారు ఓటింగ్‌లో పాల్గొని ప్రజలకు సేవ చేసే నాయకున్ని ఎన్నుకోవాలని కోరుతున్నారు.

జిల్లాలో ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు
వికారాబాద్	284	2,31,717
పరిగి	269	2,66,819
తాండూరు	269	2,43,244
కొడంగల్	275	2,40,000

పట్టణాల్లోనే వెనుకబాటు

జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదవుతోంది. ఇలాంటి ప్రాంతాలను గుర్తించిన అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం బాగానే ఉన్నా పట్టణ కేంద్రాల్లో మాత్రం చాలా తక్కువగా నమోదైంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లడం, వేరే ప్రాంతాల్లో నివాసం ఏర్పర్చుకుని ఉండటం, ఉద్యోగ, ఉపాధి పనుల్లో ఉండి తీరిక లేకపోవడం వంటి కారణాలతో ఓటు వేసేందుకు ఆసక్తి చూపడం లేదని అధికారుల పరిశీలనలో తేలింది. మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడంపై అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా పట్టణ ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించి చైతన్యం చేస్తున్నారు. ఓటు ప్రాధాన్యతను వివరిస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కల్పిస్తున్నాం. స్వీప్ కార్యక్రమం ద్వారా కళాశాలల్లో విద్యార్థులకు సదస్సులు నిర్వహించాం. అసెంబ్లీ ఎన్నికల కంటే ఎక్కువ శాతం ఓట్లు పోలియ్యేలా చర్యలు చేపట్టాం. ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి. ఓటు శాతం పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

– వాసుచంద్ర, పరిగి, ఏఆర్‌ఓ

ఆయిల్‌పాంతో అధిక లాభాలు

- ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ రంగారెడ్డి జిల్లా అధికారి నీరజాగాంధీ

యాచారం: ఆయిల్‌పాంతో అధిక లాభాలు పొందే అవకాశం ఉందని, రైతులు సాగుపై దృష్టి సారించాలని ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి నీరజాగాంధీ సూచించారు. మండల పరిధిలోని మాల్, చింతపట్ల, నందివనపర్తి గ్రామాల్లో సోమవారం ఆయిల్‌పాం తోటలను ఆమె పరిశీలించారు. వేసవిలో పంట సాగులో తీసుకోవాల్సినజాగ్రత్తలపై రైతులకు సూచన లు చేశారు.సాగులో ఏవైనా ఇబ్బందులుంటే స్థానికంగా ఉండే ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారులు సంజయ్‌కుమార్, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తనిఖీల్లో రూ.10 లక్షలు పట్టివేత



పట్టుబడ్డ నగదును చూపుతున్న పోలీసులు

కుల్కచర్ల: సరైన ధ్రువపత్రాలు లేకుండా నగదును తరలిస్తున్న వాహనాన్ని అదుపులోకి తీసుకొని, రూ.10 లక్షలు సీజ్ చేసిన ఘటన మండల పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండీడ్ మండలానికి చెందిన అభినవ్‌రెడ్డి కులకచర్ల నుంచి స్వగ్రామానికి కారులో వెళ్తున్న క్రమంలో అంతారం స్టేజీ దగ్గర పోలీసులు తనిఖీ చేశారు. అందులో రూ.10 లక్షలు లభ్యమయ్యాయి. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు అభినవ్‌రెడ్డి చూపకపోవడంతో వాటిని సీజ్ చేసి కలెక్టరేట్‌కు తరలించినట్లు కుల్కచర్ల ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.

తండ్రి ఆత్మహత్య కేసును పట్టించుకోవట్లేదని..

డీఎస్పీ కార్యాలయం ఎదుట పెట్రోల్ డబ్బాతో కుమారుడి హల్‌చల్

అనంతగిరి: తన తండ్రి ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోకుండా పోలీసులు జాప్యం చేస్తున్నారని ధారూరు మండలం హరిదాసుపల్లికి చెందిన గట్టెపల్లి రాజు పెట్రోల్ డబ్బాతో హల్‌చల్ చేశారు. ఈ మేరకు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి వికారాబాద్ డీఎస్పీ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు.

అసలేం జరిగింది


హరిదాసుపల్లిలో రాజు తండ్రి సుదర్శన్ ఇంటి నిర్మాణం జరుగుతుండగా స్థల వివాదం చోటు చేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన సుదర్శన్ ఈనెల 2న ఆత్మహత్య చేసుకున్నాడు. తన భర్త మృతికి వేధింపులే కారణమంటూ అమృతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ డీఎస్పీ కార్యాలయం వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న రాజును పోలీసు సిబ్బంది అడ్డుకుంది. పెట్రోల్ డబ్బాను లాక్కొని సముదాయించారు.

ఆరోపణల్లో నిజం లేదు: ఎస్పీ

వికారాబాద్ డీఎస్పీ కార్యాలయం ఎదుట రాజు తనపై పెట్రోల్ పోసుకుని బెదిరించి చేసిన ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో ఉందన్నారు. పూర్తిగా న్యాయపరంగా, నిష్పక్షపాతంగా కొనసాగుతుందన్నారు. ఫిర్యాదుదారుడు ఎలాంటి అపోహలను నమ్మవద్దన్నారు. పోలీసు అధికారులపై చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని, అధికారులపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

ఓటమి నుంచి పాఠం నేర్చుకో

- పరీక్ష ఫెయిలైనంత మాత్రాన జీవితం ముగిసినట్లు కాదు
- విజయం వరించే వరకూ పోరాడు
- నేడు పదో తరగతి పరీక్ష ఫలితాలు



- రాజేంద్రనగర్‌లోని హైదర్‌గూడలో నివాసం ఉండే ఓ విద్యార్థిని ఎంపీసీ మొదటి సంవత్సరం ఒక సబ్జెక్టులో ఉత్తీర్ణత సాధించలేదు. మనోవేదనకు గురైన బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది.
- ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయ్యాడని కడ్తాల్ మండలంలోని రావిచేడ్ గ్రామానికి చెందిన ఉదయ్‌కిరణ్ ఉరేసుకొని తల్లిదండ్రులకు పుట్టెడు దుఃఖాన్ని మిగిలించాడు.

అనంతగిరి: చదువు కోసం చాలా ఖర్చు చేస్తున్నాం.. అధిక మార్కులు, ర్యాంకు రాకుంటే డబ్బులు వృథా అంటూ నేటితరం తల్లిదండ్రులు చాలామంది పిల్లలకు చెబుతున్నారు. మార్కులు, ర్యాంకుల వేటలో వారిని తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఇవే పిల్లల్ని మానసిన వేదనకు గురి చేస్తున్నాయి. చదువులో కొంత మేర ప్రతిభ ఉన్న విద్యార్థులే దారుణ నిర్ణయాలు తీసుకుంటున్నారు. చదువులో పూర్తిగా వెనుకబడిన వారు తల్లిదండ్రుల మాటల్ని పట్టించుకోవట్లేదు. మెజార్టీ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు మార్కులు, ర్యాంకుల మోజుతో తప్పులు చేస్తున్నాయి. మార్కుల్లో వీరే ముందంజలో ఉన్నారంటూ రంగురంగుల పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు.

వేగాన్ని అందుకోలేక..

గెలుపోటముల సుదీర్ఘ ప్రయాణమే మనిషి జీవితం. ఇందులో కల్మషం లేనిది బాల్యం. ఈ వయసులోని బాలబాలికలకు ఓటమిని తట్టుకునే శక్తి తక్కువ. చిన్న అంతరాలనే మోయలేని పసి మనసు వీరిది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువును ఆర్జించే విధానం పూర్తిగా మారిపోయింది. ర్యాంకులు, ఉత్తమశ్రేణి సంస్థల్లో సీట్లు అంటూ కొంతమంది తల్లిదండ్రులు, పలు ప్రైవేటు విద్యాసంస్థలు చిన్నారి హృదయాలను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నాయి. ఆ వేగాన్ని అందుకోలేని పలువురు విద్యార్థులు అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు. పది తప్పామని.. ఇంటర్ ఫెయిలయ్యామని ఆత్మహత్యలకు పాల్పడుతూ కన్నవారికి గర్భశోకం మిగులుస్తున్నారు.

ప్రతిభకు సానబెట్టాలి

అమావాస్య తర్వాత పున్నమి కాంతులకు పక్షం రోజులు పట్టినట్లే.. ఓటమి నుంచి పాఠాలను నేర్చుకుంటే విజయం వరిస్తుందని యువత గ్రహించాలి. దేహానికి తప్ప దాహానికి పనికిరాని సముద్రపు కెరటాలు ఎగిసి పడుతుంటే ఇప్పుడు వచ్చిన కాస్త కష్టానికి తలవంచితే ఎలా? అన్న శ్రీశ్రీ మాటలను ఒక్కసారి మననం చేసుకోవాలి. చదువు అనేది జీవితంలో ఒక భాగం మాత్రమే.. అంతేకానీ చదువే జీవితం కాదనేది గుర్తించాలి. ఉన్నత చదువులు లేని ఎంతో మంది జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదిగిన వారు మన చుట్టూ ఎంతోమంది ఉన్నారు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుంది. దాన్ని గుర్తించి సానబెడితే కోరుకున్న రంగంలో ఉన్నత స్థితికి చేరుకుంటారు. ప్రస్తుతం ఆయా రంగాల్లో విజేతలుగా చలామణీ అవుతున్న వారు సైతం మొదట్లో వైఫల్యాలను రుచి చూసిన వారేనని గుర్తించాలి.

చిన్న విషయాలకే పెద్ద నిర్ణయాలు

విదార్థులు చిన్న విషయాలకే పెద్ద నిర్ణయాలు తీసుకొని తల్లిదండ్రులను అనాథలు చేస్తున్నారు. అల్లారు ముద్దుగా పెంచిన పిల్లలు చిన్నచిన్న కారణాలకే తనువు చాలించిన ఘటనలు కుటుంబ సభ్యుల్ని విషాదంలోకి నెట్టేస్తున్నాయి. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఫెయిలయ్యామనే కారణంతో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. నేడు పదో తరగతి ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు మానసిక ధైర్యాన్ని అందించాలి. ఫలితాలను మార్చే అవకాశం కూడా లేనందున మళ్లీ మంచి మార్కులు సాధించే దిశగా వారిని ప్రోత్సహించాలి.

వీరు ఎందరికో ఆదర్శం

- క్రికెట్ దేవుడిగా పేరొందిన సచిన్ టెండూల్కర్ పదో తరగతిలో ఫెయిలయ్యారు. అలాగని తనకు ఇష్టమైన ఆటను మాత్రం అశ్రద్ధ చేయలేదు. ఎన్నో ప్రతికూలతలను తట్టుకుని.. లక్ష్యాన్ని చేరుకోవడమే ధ్యేయంగా ముందుకు సాగారు. తన ప్రతిభతో అందరికీ ఆదర్శప్రాయుడిగా నిలిచారు.
- విభిన్న పాత్రల్ని సులువుగా పోషించే సినీ నటుడు కమల్‌హాసన్ స్కూల్ డ్రాపౌట్. ఆయన పదో తరగతి కూడా చదవలేదు. అయితేనేం నాలుగు దక్షిణ భారత భాషల్లో అనర్గళంగా మాట్లాడటం, చదవడంపై పట్టు సాధించారు. మల్టీ టాలెంటెడ్ స్టార్‌గా ఎదిగారు.
- స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య హైస్కూల్ విద్యను సైతం పూర్తి చేయలేదు. అయినప్పటికీ బాల్యంలోనే పత్రికను నడిపారు. డిగ్రీ, పీజీ పట్టాలు లేకపోయినా తమ జీవితాల్లో అద్భుతాలు చేసిన వారెందరో మన చుట్టూనే ఉన్నారు. ఇలాంటి గొప్పవారి జీవితాలను ఒక్కసారి గమనించాలి.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

జినుగుర్తిలో ఆంజనేయస్వామి ఆలయానికి భక్తుల తాకిడి

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తిలో ఆంజనేయస్వామి దేవాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కనుల పండువగా సాగింది. సోమవారం ఆలయంలో ఉత్తమ్‌చందు, కరమ్‌చందు దంపతులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అంతకు ముందురోజు ధ్వజ స్తంభానికి గ్రామానికి చెందిన ఆడపడుచులు నీళ్లతో కడిగి పూజలు చేశారు. పండితుడు సుధీర్ ఆధ్వర్యంలో ఆవాహిత దేవతా పూజ, జలాధివాసం, పుష్పాధివాసం, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మోహన్‌దాస్, జగదాంబ, రఘు కిషోర్, మురళి, రాంలింగారెడ్డి, నారాయణరెడ్డి, రాములు, శ్రీనివాస్‌గౌడ్, నరేష్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, శ్యామప్ప, శ్రీధర్‌గౌడ్, మహేష్, రాజు, బాలప్ప, శివకుమార్, నరేష్ పాల్గొన్నారు.



దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

ఓవర్‌టేక్ చేయబోయి..

ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన బైక్.. ఒకరి దుర్మరణం

ధారూరు: ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న మరో ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొట్టిన ఘటనలో ఒకరు దుర్మరణం చెందారు. మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రం సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన కావలి ఆనందం(35), కావలి సాయిలు కలిసి వికారాబాద్ నుంచి ధారూరుకు బైక్‌పై వస్తున్నారు. ధారూరు సమీపంలోకి రాగానే ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ ప్రైవేటు బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న ఆనందం ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందగా సాయిలు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే 108లో వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి క్షతగాత్రుడిని తరలించారు.



ఆనందం మృతదేహం వద్ద రోదిస్తున్న ఆయన సోదరుడు

పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఘటనాస్థలికి మృతుడి ఆనందం బంధువులు చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు. తాండూర్ నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న బస్సు డ్రైవర్ ముందు గుంత రావడంతో కుడి వైపునకు మళ్లించడం, ఎదురుగా వస్తున్న బైక్ బస్సును ఢీకొట్టడం క్షణాల్లో జరిగిందని పోలీసులు తెలిపారు.

మళ్లీ మోదీయే ప్రధాని

బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



కుల్కచర్ల చౌరస్తాలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కుల్కచర్ల: దేశ ప్రజలందరూ మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ మారుమూల గ్రామానికి వెళ్లిన ప్రధాని మోదీని గుర్తుపట్టే పరిస్థితి ఉందన్నారు. కానీ ఇండియా కూటమిలో ఎవరు ప్రధాని అవుతారో ఆ పార్టీ నేతలకే తెలియని దుస్థితి నెలకొంది అన్నారు. అనిశ్చితిలో కొట్టుమిట్టాడే పార్టీలకు ఓటేస్తే అవినీతి తప్ప మరేం చేయరన్నారు. అవినీతి రహిత పాలన కావాలంటే మళ్లీ మోదీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అవకాశవాద రాజకీయాలకు పాల్పడే నేతలకు ఓటేస్తే మోసపోవడం తప్ప మనకు ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. కాంగ్రెస్ గ్యారంటీలన్నీ ఉత్తిమాటలే అని విమర్శించారు. ప్రపంచం గర్వించదగ్గ దేశంగా భారతదేశాన్ని తీర్చిదిద్దిన ఘనత ఒక్క మోదీకే దక్కుతుందన్నారు. హిందూ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రామమందిరాన్ని కట్టించింది మోదీ ఆధ్వర్యంలో అన్నారు. రాజ్యాంగం మార్చుతారంటూ అబద్ధపు ప్రచారాన్ని ప్రారంభించిన నేతలకు ఓటర్లు తగిన విధంగా బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ప్రహ్లాదరావు, నాయకులు మారుతికిరణ్, మిట్టాపరమేశ్వర్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, జానకిరాం, సోమ్యారెడ్డి, మైపాల్, సురేష్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

మోదీకి అండగా మహిళలు నిలవాలి

అనంతగిరి: ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ గొప్పతనాన్ని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి నరేంద్రమోదీ అని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి పేర్కొన్నారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని రాజీవ్ గృహకల్పలో నిర్వహించిన ముగ్గుల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధాని కావడానికి ప్రతి గడప అండగా నిలవాల్సి ఉందన్నారు. చేవెళ్లను ప్రగతి మార్గంలో పయనింపచేయడానికి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు యాస్కి శిరీష, కౌన్సిలర్ శ్రీదేవిసదానందరెడ్డి, మాజీ కౌన్సిలర్ సుచరిత రెడ్డి, నాయకులు కేపీ రాజు, పోకల సతీశ్, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి

- డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- జోరుగా ఎన్నికల ప్రచారం



పరిగి: ఎన్నికల ప్రచారంలో డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



పూడూరు: బీఆర్‌ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

పరిగి: ప్రస్తుతం దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని.. వాటి నుంచి గట్టెక్కాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావాలని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణ కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఇబ్రహీంపూర్, రూప్‌సింగ్‌తండా, సోండేపూర్‌తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందని, దేశంలో సైతం మా పార్టీ పాలనా పగ్గాలు చేపడితే అభివృద్ధి జోరందుకుంటుదన్నారు. పదేళ్ల బీజేపీ అధికారంలో ఉండి దేశ ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. దేశ సంపద మొత్తాన్ని కార్పొరేట్ సంస్థల చేతుల్లో పెట్టిందన్నారు. ప్రభుత్వ ఆస్తులు, సంస్థలను ప్రైవేటు పరం చేసి దేశాన్ని సర్వనాశనం చేశారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని.. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం ముందుందన్నారు. కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టులోపు రుణమాఫీ

పూడూరు: కలిసికట్టుగా పని చేసి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి సీఎంకు గిఫ్ట్ ఇవ్వాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కోరారు. బీఆర్‌ఎస్ నుంచి నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేశారు. ఈ సందర్భంగా మన్నెగూడలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని పంద్రాగస్టు లోపు రుణమాఫీ చేస్తామని అన్నారు. బీజేపీతో పెను ప్రమాదం వచ్చే అవకాశం ఉందన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు రద్దు చేస్తామని బాహాటంగా ప్రచారం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరికీ వ్యతిరేకం కాదని, అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందన్నారు. జాతీయ అధినాయకత్వం ఆదేశాల మేరకే పార్టీలో చేరికలు జరుగుతున్నాయన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులను చేర్చుకుంటే కాంగ్రెస్ సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఎన్కేపల్లి, చింతలపల్లి గ్రామాల సర్పంచ్‌లు వనజ వేణుగోపాల్, రాజవర్ధన్‌రెడ్డి, పెద్ద ఉమ్మెంతాల్ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు కడ్మూరు ఆనందం, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు కండ్లపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్ గుప్తా, ప్రధాన కార్యదర్శులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, మాజీద్‌ఖాన్, నాయకులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలకు నీడ



నీడ కింద ఉపాధి కూలీలు

సాక్షి ఎఫెక్ట్..

బొంరాస్‌పేట: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలు వేసవితాపానికి అల్లాడుతున్నారంటూ ఆదివారం 'కూలీ.. ఎండకు తల్లడిల్లీ' అనే శీర్షికతో 'సాక్షి'లో వార్త ప్రచురితమయింది. దీనికి సోమవారం ఉపాధిహామీ అధికారులు స్పందించారు. మండల పరిధిలోని తుంకమెట్లలో ఒండ్రుమట్టి పనులు చేస్తున్న సుమారు 200 మందికి నిలువనీడ, తాగునీరు సౌకర్యం కల్పించారు. సీనియర్ మేటీ, మాజీ ఉపసర్పంచ్ వెంకటయ్య ఉపాధి కూలీలకు ఒండ్రుమట్టి పనుల వద్ద టెంట్లు, ఆకుపచ్చతెరలు, తాగునీరు ఏర్పాటు చేసి సేదదీర్చారు.

జింక మాంసం అనుమానంతో తనిఖీలు

తాండూరు టౌన్: జింక మాంసం ఓ వ్యక్తి ఇంట్లో ఉందనే వార్త సోమవారం తాండూరు పట్టణంలో కలకలం రేపింది. ఉన్నతాధికారుల ఆదేశానుసారం పట్టణ పోలీసులు సోదాలు చేశారు. సదరు వ్యక్తి ఇంట్లో ఉన్నది జింక మాంసమా లేదా మరేదైనా ఉందా అనే విషయంపై తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డిని వివరణ కోరగా.. పట్టణంలోని ముర్షద్ దర్గా సమీపంలోని ఓ వ్యక్తి ఇంట్లో అనుమానించదగిన అజ్ఞాత వ్యక్తి నుంచి ఉన్నతాధికారులకు వచ్చిన సమాచారంతో తనిఖీలు చేశామన్నారు. అయితే సదరు వ్యక్తి ఇంట్లో ఏమీ లభ్యం కాలేదని డీఎస్పీ చెప్పారు. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ శ్యాంసుందర్ రావును వివరణ కోరగా.. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు వారు తనిఖీలు చేపట్టగా ఏమీ లభ్యం కాలేదని, అయినప్పటికీ దీనిపై దర్యాప్తు చేస్తామని ఆయన తెలిపారు. వన్య ప్రాణులకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డుపై ధాన్యం.. ప్రమాదంలో ప్రయాణం


- నూర్పిడి కల్లాలుగా రహదారులు
- ప్రమాదాలకు నిలయంగా జాతీయ రహదారి
- పట్టించుకోని అధికార యంత్రాంగం

పంట దిగుబడుల ఆరబోతకు సరైన వసతులు లేక అన్నదాతలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీంతో రోడ్లపైనే పంట ఉత్పత్తులను ఆరబెడుతున్నారు. వాహనదారులు రాకపోకల సమయంలో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

బొంరాస్‌పేట: పంట నూర్పిడి సమయంలో రహదారులన్నీ కల్లాలుగా మారుతున్నాయి. బొంరాస్‌పేట, దుద్యాల మండలాల పరిధిలోని బీటీ రోడ్లన్నీ ఖరీఫ్, యాసంగి సమయాల్లో ధాన్యం నూర్పిడి కల్లాలుగా తయారవుతున్నాయి. ఖరీఫ్‌లో పెసర, మినుము, వరి పంటలను రహదారులపై నూర్పిడి చేసి ఆరబోస్తున్నారు. యాసంగిలో ప్రధానంగా వరి ధాన్యాన్ని తేమను తగ్గించేందుకు రహదారులపై ఉంచుతున్నారు. ధాన్యం చుట్టూ రాళ్లు, కర్రలు, చెట్లకొమ్మలు ఉంచడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఫలితంగా ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. రాత్రిపూట ధాన్యం కుప్పలపై నల్లటి టార్పలిన్ కవర్లు కప్పి ఉంచడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పెద్ద వాహనాలు ఎదురైనప్పుడూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పలు సందర్భాల్లో ప్రాణాలు సైతం కోల్పోయిన ఉదంతాలు ఉన్నాయి.



తుంకిమెట్ల జాతీయ రహదారిపై పోసిన ధాన్యం



లింగన్‌పల్లి గేటు వద్ద రోడ్డుపై ఇలా..

ధాన్యంతో నిండాయి

మండల పరిధిలో ఉన్న 13 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి(163)పై మెట్లకుంటతండాలు, తుంకిమెట్ల, బొట్లోనితండా, నాగిరెడ్డిపల్లి, లింగన్‌పల్లి తదితర ప్రాంతాల్లో ప్రస్తుతం వరి ధాన్యం ఆరబోస్తున్నారు. మదన్‌పల్లి, సాలిండాపూర్, హంసాన్‌పల్లి, ఏర్పుమళ్ల, బాపల్లి తదితర బీటీ రోడ్లన్నీ వరి ధాన్యంతో నింపోతున్నాయి. అలాగే దుద్యాల పరిధిలోని నాజ్‌ఖాన్‌పల్లి, చిల్మల్‌మైలారం, చెట్టుపల్లితండా, గౌరారం, లగచర్ల, ఈర్లపల్లి, హకీంపేట, పోలెపల్లి, దుద్యాల బీటీ రోడ్లన్నీ వరి ధాన్యం కుప్పలతో ఉన్నాయి. రైతుల పొలాల్లో ప్రభుత్వం నిర్మించిన పంట నూర్పిడి కల్లాలు ఏమయ్యాయని ప్రజలు, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

ఆరబోత ఎక్కడ?

పండించిన ఉత్పత్తులకు ఆరబోసేందుకు సరైన వసతులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సమీపంలో రహదారుల వెంబడి పంటను ఆరబెట్టి కాలం వెళ్లదీస్తున్నారు. దీన్ని గమనించని వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళలో ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. రోడ్డుపైనే ధాన్యాన్ని ఆరబెట్టడం ప్రయాణానికి ఆటంకం కలిగిస్తోందని వారు వాపోతున్నారు. రైతులు సైతం తమకు ఆరబెట్టేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని అధికారులను కోరుతున్నారు.

సీనియారిటీ ప్రకారం డ్యూటీలుండాలి

డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన యూటీఎఫ్ సభ్యులు


కొడంగల్: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే ఉద్యోగులకు సీనియారిటీ ప్రకారం డ్యూటీలు వేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) సభ్యులు కోరారు. ఈమేరకు సోమవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అన్ని ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలను కలుపుకొని నిష్పక్షపాతంగా విధులు కేటాయించాలన్నారు. ఒక ఉపాధ్యాయ సంఘానికి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. మండలంలో యూటీఎఫ్, పీఆర్‌టీయూ, ఎస్‌టీయూ, తాపస్, డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాలు ఉన్నట్లు తెలిపారు. ఇందులో ఒక ఉపాధ్యాయ సంఘానికి ప్రాధాన్యం ఇచ్చి వారికి ఎక్కువ డ్యూటీలు వేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ముత్యప్ప, మండల కమిటీ అధ్యక్షుడు బసప్ప, ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్, నర్సింలు పాల్గొన్నారు.



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

నీటి ఎద్దడి రాకుండా చర్యలు

మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్



మరమ్మతు చేయించిన మోటారు

పరిగి: మున్సిపాలిటిలో నీటి సమస్యలు తలెత్తకుండా అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో నీటి సమస్య తలెత్తడంతో సోమవారం బోరు మోటారును మరమ్మతు చేయించి నీటిని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎండల తీవ్రత చాలా ఉందని నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. భూగర్భ జలాలు అడుగంటి బోరుబావుల్లో నీటి మట్టం తగ్గుతుందన్నారు. ఎండలకు నీటి సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. నీటి సరఫరా కాని కాలనీలకు ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగేశ్వర్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.